తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
సోమవారం
28 సెప్టెంబర్ 2026

## తుమ్మిళ్ల ఎత్తిపోతలతో
# ఆర్డీఎస్ జలకళ



- ఆర్డీఎస్‌కు చేరిన తుంగభద్ర జలాలు
- వరద నీటితో తుమ్మిళ్ల లిఫ్ట్ సందడి

**రాజోళి, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** తుంగభద్ర నదిలో వరద నీటి ప్రవాహం పెరగడంతో రాజోళి మండల రైతుల్లో ఆశలు చిగురించాయి. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా ఆదివారం అధికారులు నీటిని ఎత్తిపోసి ఆర్డీఎస్ కాల్వలోకి విడుదల చేయడంతో కాల్వకు జలకళ వచ్చింది. ఒక పంపు ద్వారా తనగల శివారులోని ఆర్డీఎస్ కాల్వలోకి నీటిని పంప్ చేయగా.. కాల్వ నిండుకుండలా ప్రవహించింది. దీంతో పరిసర ప్రాంతాల రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వర్షాలపై ఆధారపడి ఇప్పటికే పంటలు సాగు చేసిన రైతులకు తుమ్మిళ్ల ఎత్తిపోతల ద్వారా నీటి విడుదల ఊరటనిచ్చింది. కొన్ని ప్రాంతాల్లో పంటలు నీటి అవసరం ఉన్న దశకు చేరుకోవడంతో కాల్వలోకి నీరు రావడం రైతులకు ఉపయోగకరంగా మారింది. పొలాలకు నీరు అందుతుందన్న ఆశతో రైతులు ఉత్సాహం వ్యక్తం చేస్తున్నారు. నీటి లభ్యత ఉంటే పంటలను కాపాడుకోవచ్చని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

**సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు...**

ఆర్డీఎస్ కాల్వలో నీరు ప్రవహించడంతో నీటి ఆధారంగా పంటలు సాగు చేసేందుకు మరికొందరు రైతులు సన్నద్ధమవుతున్నారు. కాల్వ పరిధిలోని ఆయకట్టు రైతుల్లో కొత్త ఆశలు నెలకొన్నాయి. వరద నీటిని సద్వినియోగం చేసుకుని సాగును ముందుకు తీసుకెళ్లేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే సాగులో ఉన్న పంటలకు నీరు అందడంతో పాటు కొత్తగా సాగు చేపట్టే అవకాశం కూడా ఉంటుందని రైతులు భావిస్తున్నారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా ప్రస్తుతం ఒక పంపుతో నీటిని ఎత్తిపోస్తున్నప్పటికీ..ఈ నీటి విడుదల ఎన్ని రోజుల పాటు కొనసాగుతుందనే అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. వరద నీరు అందుబాటులో ఉన్న సమయంలో నిరంతరాయంగా నీటిని ఎత్తిపోస్తే మరింత ప్రయోజనం చేకూరుతుందని పేర్కొంటున్నారు. నీటి విడుదలపై ముందస్తు సమాచారం ఇస్తే రైతులు తమ పంటల సాగు, నీటి వినియోగంపై ప్రణాళిక రూపొందించుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

**రైతుల్లో పెరిగిన ఆశలు...**

ఈ సీజన్‌లో తొలిసారిగా తుమ్మిళ్ల లిఫ్ట్ ద్వారా ఆర్డీఎస్ కాల్వలోకి నీరు రావడంతో రైతుల్లో ఆశలు పెరిగాయి. గతంలో నీటి కోసం ఎదురుచూసిన రైతులకు ప్రస్తుతం కాల్వలో ప్రవహిస్తున్న నీరు కనిపించడం కొంత ఊరటనిచ్చింది. తుంగభద్రలో వరద నీరు అందుబాటులో ఉన్నంతకాలం తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని వినియోగించుకుంటే ఆయకట్టు రైతులకు ప్రయోజనం కలుగుతుందని రైతులు పేర్కొంటున్నారు. తుంగభద్రలో వరద ప్రవాహం ఉన్న సమయంలో తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని ఎత్తిపోసి ఆర్డీఎస్ కాల్వకు అందిస్తే పరిసర ప్రాంతాల రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందని అన్నదాతలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం కాల్వలోకి చేరిన నీటిని చూసి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నీటి విడుదలపై స్పష్టమైన ప్రకటన చేసి, సాధ్యమైనంత మేరకు నీటిని అందించాలని రైతులు కోరుతున్నారు.


మిగతా 5లో..

## ఖిల్లా కోటను పర్యాటక కేంద్రంగా
## అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

- వనపర్తి పర్యాటక ప్రాంతాలను ప్రజలకు పరిచయం చేయడమే ట్రెకింగ్ లక్ష్యం: కలెక్టర్ ఆదర్శ్ సురభి

**ఖిల్లా ఘనపురం, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా వనపర్తి జిల్లాలోని చారిత్రక, పర్యాటక ప్రాంతాలను ప్రజలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఖిల్లా గట్టు వద్ద ట్రెకింగ్ నిర్వహించారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, అధికారులు పాల్గొని కోటను సందర్శించారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...** ఘనపురం ఖిల్లాకు గొప్ప చారిత్రక ప్రాధాన్యత ఉందన్నారు. కాకతీయుల కాలం నాటి నిర్మాణాలు, గొలుసుకట్టు చెరువులు అప్పటి పాలకుల దూరదృష్టి, ఇంజినీరింగ్ నైపుణ్యానికి నిదర్శనమన్నారు. ఖిల్లా అభివృద్ధికి పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో చర్చించి రూ.2 కోట్ల నిధులతో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు, అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఖిల్లా ఘనపురాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లాలోని చారిత్రక ప్రాంతాలను అభివృద్ధి చేసి వాటికి గుర్తింపు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. సరళాసాగర్‌లోని సైఫన్ విధానం, రాజమహల్ వంటి చారిత్రక కట్టడాల ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు.

## ఆర్టీసీ బంక్ పక్కన పేరుకుపోయిన చెత్త కుప్పలు..


- పట్టించుకోని అధికారులు!



**గద్వాల, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** గద్వాల జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ పెట్రోల్ బంక్ పక్కన చాలా రోజులుగా భారీగా చెత్త పేరుకుపోవడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతం నుండి వస్తున్న తీవ్ర దుర్వాసనతో రాకపోకలు సాగించడం నరకంగా మారిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యపై స్థానికులు పలుమార్లు మొరపెట్టుకున్నా, మున్సిపల్ అధికారులు ఏమాత్రం పట్టించుకోనట్లు వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు మండిపడుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు తిరిగే ప్రధాన రహదారి పక్కనే ఇంతటి పారిశుధ్య లోపం ఉన్నా యంత్రాంగం నిర్లక్ష్యంగా ఉండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ప్రస్తుతం అక్కడ దోమలు విపరీతంగా ప్రబలిపోవడంతో డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందని ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఇప్పటికైనా తక్షణమే స్పందించి, పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని మరియు పరిసరాలను శుభ్రం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# పరిశ్రమల్లో ఏమి జరిగినా పట్టించుకోని అధికారులు

- మండలంలో కొన్ని పరిశ్రమలు ఉన్నాయని పరిశ్రమల శాఖకే తెలియకపోవడం విడ్డూరం
- పోలేపల్లి పారిశ్రామిక వాడలోని పరిశ్రమల్లో కార్మికశాఖ తనిఖీలు ఉండవు
- కొన్ని పరిశ్రమలకు అనుమతులు ఒక ఉత్పత్తికి ఉంటే మరో ఉత్పత్తి తయారు
- ముదిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న పరిశ్రమలకు ప్రభుత్వ చట్టాలే పట్టవు



**రాజాపూర్, సెప్టెంబర్ 27(జనంసాక్షి):** ప్రభుత్వాలు పరిశ్రమలు నెలకొల్పడానికి పచ్చని పంట పొలాలను రైతులకు అరకొర డబ్బులు చెల్లించి, పరిశ్రమల యాజమాన్యాలకు భూములను పరిశ్రమలు నెలకొల్పడానికి మార్కెట్ ధరకంటే తక్కువకు ఇచ్చేస్తున్నారు. కానీ పరిశ్రమల పేరుమీద ఈ భూములు తీసుకున్న అందరూ పరిశ్రమలు నెలకొల్పారా లేదా అనేది ఎవరూ వెల్లడించరు. పరిశ్రమలు నెలకొల్పడానికి హడావుడి చేసిన ప్రభుత్వాలు స్థానిక యువతకు ఉపాధి కల్పించడంలో విఫలమైనాయి. రాజాపూర్ మండలంలో కొన్ని పరిశ్రమలు టీఎస్ఐపాస్ అనుమతులు ఉన్నాయని చెబుతూ గ్రామపంచాయతీ సిబ్బందిని సైతం లెక్కచేయకుండా తమ పని తాము చేసుకుంటున్నారు. ఇలాంటి పరిశ్రమలు ఉన్నాయని పరిశ్రమల శాఖ అధికారులు కూడా తనిఖీ చేయకుండా వదిలేయడం పలు అనుమానాలకు దారితీస్తుంది. పోలేపల్లి సెజ్‌లో ఉన్న పరిశ్రమల్లో కార్మికులు మొత్తం కాంట్రాక్టు పద్ధతిలోనే ఉంటారు. కానీ ఈ పారిశ్రామికవాడ పరిదిలోనే ముదిరెడ్డిపల్లి శివారు లో ఉన్న కార్మికులకు ఎటువంటి సౌకర్యాలు ఉండవు.చేతి గ్లౌజులు ఉండవు.మాస్కులు ఉండవు, హెల్మెట్ లు ఉండవు,



మిగతా 5లో..

ఎమర్జెన్సీ వైద్య సదుపాయం అందుబాటులో ఉండదు. ఇలా ఎక్కడ చూసినా నిర్లక్ష్యం కనిపిస్తుంది. ముదిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న "నాసర్ బోన్ ప్రోడక్ట్స్" పరిశ్రమలో పశువుల బొక్కలను ప్రాసెస్ చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. ఎన్నో సంవత్సరాలుగా దుర్వాసన వస్తుంది అని, ముదిరెడ్డిపల్లి గ్రామస్తులు ఎన్ని పిర్యాదు లు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు అంటున్నారు. ఈ పరిశ్రమలో ఇతర రాష్ట్రాలకు చెందిన మహిళా కార్మికులు పనిచేస్తున్నారు. వారికి మాస్కులు లేవు, చేతి గ్లౌజులు లేవు, అక్కడ వచ్చే దుర్వాసనకు అర్ద కిలోమీటర్ వరకు ఎవరూ ఉండలేరు. పరిశ్రమలో ఉన్న విద్యుత్ సరఫరా ప్యానెల్ బోర్డులు ఎంతో ప్రమాదకరంగా ఉన్నాయి. ఎక్కడ చూసినా విద్యుత్ తీగలు ఎలా పడితే అలా వేలాడే విద్యుత్ తీగలు. ఇంత ప్రమాదకరంగా ఉన్న చోట పదుల సంఖ్యలో కార్మికులు పనిచేస్తున్నారంటే ! కార్మీక శాఖ ఎక్కడా? కాలంచెల్లిన యంత్రాలు పనితీరును పరిశీలించాల్సిన పరిశ్రమల శాఖ అధికారులు ఎక్కడా? పరిశ్రమలో నిత్యం ఉపయోగించే బాయిలర్ అత్యంత కీలకమైన యంత్రం దగ్గర ఎటువంటి అనుభవం లేని బీహార్ కూలీలను పెట్టి నడిపిస్తారు.

# మెదక్‌లో వెల్లివిరిసిన సంస్కృతి వైభోగం

• **16 కళారూపాలతో ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ ర్యాలీ**





**మెదక్ టౌన్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్క రించుకుని మెదక్‌లో ఆదివారం పర్యాటక సంబరాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 4 వేల మంది పాల్గొన్న భారీ ర్యాలీని మెదక్ ఖిల్లా నుంచి వెస్లీ కళాశాల వరకు నిర్వహించారు. కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు ఎస్పీ విక్రమ్ కుమార్ సింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతిరాజు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఖిల్లాను సందర్శించే పర్యాటకుల కోసం టికెట్ కౌంటర్‌ను ప్రారంభించారు. ర్యాలీలో డప్పు, డోలు, తంబుర, చిందు, భాగవతం, బోనాలు, బతుకమ్మ, లంబాడీ నృత్యాలు, గీత కార్మికులు, కరాటే, ఎన్‌సీసీ, ఒగ్గు కళాకారులు తదితర 16 కళారూపాల ప్రతినిధులు సంప్రదాయ వేషధారణలో పాల్గొని ఆకట్టుకున్నారు.

**పర్యాటక ప్రాంతాలకు ప్రపంచస్థాయి గుర్తింపు**

వెస్లీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పర్యాటక రంగంపై ఏవీ ప్రదర్శించారు. అనంతరం ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు, కలెక్టర్, అదనపు ఎస్పీ, మున్సిపల్ చైర్‌పర్సన్ శాంతికి ప్రతీకగా తెల్ల పావురాలను ఎగురవేశారు. మెదక్ జిల్లా పర్యాటక వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. మెదక్ పర్యాటక ప్రాంతాలను దేశవ్యాప్తంగా ప్రచారం చేసి మరింత మంది పర్యాటకులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ సూచించారు. పోచారం అభయారణ్యం, నర్సాపూర్ అర్బన్ పార్క్, ఏడుపాయల వనదుర్గ, మెదక్ చర్చి తదితర ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కోరారు. పర్యాటక రంగం అభివృద్ధితో స్థానిక ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

**14 ప్రాంతాలతో పర్యాటక సర్క్యూట్**

కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లాను పర్యాటక సర్క్యూట్‌గా అభివృద్ధి చేసేందుకు 14 ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. మెదక్ పర్యాటక ప్రాంతాలకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావడమే లక్ష్యమన్నారు. పర్యాటక రంగం అభివృద్ధితో స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.

**విద్యార్థులకు ప్రోత్సాహం...**

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో అంబాదాస్ రాజేశ్వర్, జిల్లా టూరిజం అధికారి ఎల్లయ్య, ఆర్డీవో రమాదేవి, డీపీఆర్వో రామచంద్రరాజు, అధికారులు, కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పీఆర్‌టీయూ మండల శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

## ఒకే రాత్రి మూడు ఇళ్లలో చోరీ

• **బద్దిపడగలో భయాందోళనలు**
• **తాళాలు పగులగొట్టి నగదు, ఆభరణాల కోసం దుండగుల గాలింపు**
• **రాత్రి వేళ పోలీసు గస్తీ పెంచాలని గ్రామస్థుల విజ్ఞప్తి**

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం బద్దిపడగలో ఒకే రాత్రి మూడు ఇళ్లలో చోరీలు జరగడంతో గ్రామస్థుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. గుర్తుతెలియని దుండగులు తాటిపాముల జనార్దన్‌గౌడ్, ఒరిగంటి గణేశ్‌రెడ్డి, సందబోయిన ఆయిలేశ్ ఇళ్ల తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఇళ్లలోని వస్తువులను చిందరవందర చేసి నగదు, ఆభరణాల కోసం గాలించారు. మూడు ఇళ్లలో కలిపి రూ.5 వేల నగదు, 20 తులాల వెండి ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు అపహరించినట్లు బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న రాజగోపాలపేట పోలీసులు ఘటనా స్థలాలను పరిశీలించి కేసు నమోదు చేశారు. దుండగుల ఆచూకీ కోసం వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఒకే రాత్రి మూడు ఇళ్లలో చోరీలతో ఆందోళన చెందిన గ్రామస్థులు రాత్రివేళ పోలీసు గస్తీ పెంచాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## వైద్యులు స్పందించక.. గేదెలు మృతి

• **రెండు రోజులుగా సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని రైతుల ఆవేదన**



**గుమ్మడిదల, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** మండలంలోని రామిరెడ్డిబావి గ్రామంలో దాదాపు పది గేదెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన సమల మోహన్‌రెడ్డికి చెందిన గేదెలు అనారోగ్యానికి గురై మృతి చెందినట్లు రైతులు తెలిపారు. రెండు రోజులుగా పశువైద్య సిబ్బందికి సమాచారం ఇచ్చినా సకాలంలో స్పందించలేదని రైతులు ఆరోపించారు. సకాలంలో చికిత్స అందించి ఉంటే పశువులను కాపాడుకునే అవకాశం ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు. వరుసగా గేదెలు మృతి చెందడంతో బాధిత రైతు కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. మృతికి అసలు కారణాలను అధికారులు వెంటనే గుర్తించాలని, మిగిలిన పశువులకు వైద్యం అందించేందుకు గ్రామంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. అలాగే బాధిత రైతుకు ప్రభుత్వం తగిన పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. గేదెల మృతికి వ్యాధి కారణమా? ఇతర కారణాలున్నాయా? అనే విషయాలను పశువైద్య అధికారులు నిర్ధారించాల్సి ఉంది.

## అదుపుతప్పిన బైక్.. వ్యక్తి మృతి





**కొల్చారం, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** కొల్చారం మండలం అప్పాజీపల్లి గ్రామానికి చెందిన శివలింగారి సూర్యకాంత్ (40) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి భార్య కృష్ణవేణి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం వ్యక్తిగత పనుల నిమిత్తం పోతంశెట్టిపల్లి చౌరస్తాకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి యూనికార్న్ మోటార్‌సైకిల్‌పై బయలుదేరాడు. పోతంశెట్టిపల్లి నుంచి అప్పాజీపల్లి వైపు వస్తుండగా మోటార్‌సైకిల్ అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న ఇనుప గ్రిల్‌ను ఢీకొట్టింది. దీంతో సూర్యకాంత్ రోడ్డుపై పడిపోగా, తల వెనుక భాగంలో తీవ్ర గాయమై రక్తస్రావమైంది. వెంటనే చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఉల్లాస్ సాక్షరతా పరీక్ష విజయవంతం



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** ఉల్లాస్-నవ భారత సాక్షరతా కార్యక్రమంలో భాగంగా 18 ఏళ్లు దాటిన నిరక్షరాస్యులకు నిర్వహించిన పరీక్ష జిల్లాలో విజయవంతమైంది. కలెక్టర్ పర్యవేక్షణలో 23 మండలాల్లో 558 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 24,321 మంది అభ్యసనదారులకు గాను 23,972 మంది పరీక్షకు హాజరయ్యారు. పఠనం, రచన, గణిత అంశాలపై పరీక్ష నిర్వహించారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ లక్ష్యమని అధికారులు తెలిపారు. పరీక్ష విజయవంతానికి సహకరించిన అధికారులు, విద్యాశాఖ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, వాలంటీర్లు, ఉపాధ్యాయులకు డీఆర్‌డీవీ అధికారి జ్యోతి కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తీర్ణులకు త్వరలో ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

## ఉల్లాస్ పరీక్షలకు 985 మంది మహిళల హాజరు



**కోహీర్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మహిళా అక్షరాస్యత పరీక్షలకు 22 కేంద్రాల్లో 985 మంది హాజరయ్యారు. మనీయార్‌పల్లి, బిడంపేట్, కొత్తూరు(కె), మాచిరెడ్డిపల్లి, పైడిగుమ్మల్, పోతిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో పరీక్షలు నిర్వహించారు. మహిళల్లో చదవడం, రాయడం, ప్రాథమిక అంశాలపై అవగాహన పెంపొందించడమే కార్యక్రమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. మహిళలు ఉత్సాహంగా పరీక్షలకు హాజరై తమ అక్షరాస్యత సామర్థ్యాలను పరీక్షించుకున్నారు. పరీక్ష కేంద్రాల్లో అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పర్యవేక్షించారు. సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఏపీఎంలు, సీసీలు, వీఓఏలు, గ్రామ సంఘాల సభ్యులు పరీక్షల నిర్వహణకు సహకరించారు.

## బీటెక్ విద్యార్థిని అదృశ్యం



**గోపాలపేట, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** పోల్కెపహాడ్ గ్రామానికి చెందిన 19 ఏళ్ల బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని పల్లవి అదృశ్యమైంది. ఈ నెల 26న మధ్యాహ్నం 12.30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, పరిసర గ్రామాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. పల్లవి గోధుమ వర్ణం, గుండ్రటి ముఖం, సుమారు 5 అడుగుల ఎత్తు ఉండి, లైట్ పింక్ పంజాబీ డ్రెస్ ధరించినట్లు పోలీసులు తెలిపారు. ఆమె అదృశ్యంపై పోల్కెపహాడ్‌కు చెందిన సాయి కుమార్‌పై అనుమానం ఉందని తండ్రి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు గాలింపు చేపట్టారు. సమాచారం ఉంటే గోపాలపేట పోలీస్ స్టేషన్ లేదా 9948337230కు తెలియజేయాలని కోరారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

**ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్**



**నంగునూరు, సెప్టెంబర్ 27(జనంసాక్షి):** పద్మశాలి సమాజం ఆధ్వర్యంలో నంగునూరు మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమ నేత, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసరి రామలింగం, సాదుల చంద్రశేఖర్, దాసరి రవి, కారపురి శ్రీనివాస్, బింగి రవీందర్, బొజ్జ మహేష్, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

## మల్కాపూర్‌లో 420వ వారం స్వచ్ఛభారత్ కార్యక్రమం



**తూప్రాన్, సెప్టెంబర్ 27. (జనంసాక్షి):** తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో 420వ వారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రవేశం వద్ద ఉన్న మినీ పార్కులో చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా పార్కులో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి, పరిసరాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. అలాగే చీపుర్లతో సీసీ రోడ్లను శుభ్రపరిచారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ స్వామి, పాలకవర్గ సభ్యులు జిన్న కృష్ణ, పిట్ల వేణు, మన్నె తిరుపతి, రేఖ నాగరాజుగౌడ్, మేకిన్ యువత, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



**కొల్చారం, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** కొల్చారం మండలంలోని రంగంపేట గ్రామంలో చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ నేత, చేనేత కార్మికుల హక్కుల కోసం కృషి చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## అన్నమ్మకు తెలంగాణ భూ రక్షణ సమితిలో కీలక బాధ్యత



**చేర్యాల, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** తెలంగాణ భూ రక్షణ సమితి రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శిగా చేర్యాల పట్టణానికి చెందిన కర్రోల్ల అన్నమ్మ నియమితులయ్యారు. హబ్సిగూడలోని హోటల్ సుప్రభాత్ లో జరిగిన రాష్ట్ర సమావేశంలో అధ్యక్షుడు బుగ్గ మైసయ్య నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు అన్నమ్మను అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలోని 25 లక్షల ఎకరాల అసైన్డ్ భూములకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించే వరకు పోరాటంలో క్రియాశీలకంగా పనిచేస్తానన్నారు. మహిళా అసైన్డ్ రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, నవంబర్ 19న జరిగే అసైన్డ్ భూమి మహాసభను విజయవంతం చేస్తానన్నారు.

## మహిళ అదృశ్యం.. ఆచూకీ కోసం పోలీసుల గాలింపు



**చేర్యాల, సెప్టెంబర్ 27 (జనం సాక్షి):** మండలంలోని కడవేర్గు గ్రామానికి చెందిన ఆవుల సంధ్యా రాణి (34) ఈ నెల 24న ఇంటి నుంచి చేర్యాలకు వచ్చి తిరిగి ఇంటికి చేరుకోలేదు. అనంతరం ఆమె ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు చేర్యాల పోలీసు లకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గూడ అపూర్వ రెడ్డి తెలిపారు. సంధ్యారాణి ఆచూకీ తెలిసిన వారు చేర్యాల పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## జాతీయ ఫెన్సింగ్ పోటీల్లో చిల్వర్ చిన్నారుల ప్రతిభ



**అల్లాదుర్గం, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం చిల్వర్ గ్రామానికి చెందిన జంబిగె శ్రీతన్ చంద్ర సాహో, జంబిగె బృంద శ్రీ జాతీయ స్థాయి ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ తరపున ప్రాతినిధ్యం వహించారు. జమ్మూ యూనివర్సిటీలో జరిగిన పోటీల్లో ఖ-12 బాలుర విభాగంలో శ్రీతన్ చంద్ర సాహో, ఖ-10 బాలికల విభాగంలో బృంద శ్రీ ప్రతిభ కనబరిచి టాప్-8లో నిలిచారు. భవిష్యత్తులో ఒలింపిక్ వేదికలపై దేశానికి పతకాలు సాధించాలని గ్రామస్థులు ఆకాంక్షించారు. మంచిరేవుల యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో చదువుతున్న క్రీడాకారులను, వారి తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు.

## యువసేన యూత్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



**నంగునూరు, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** మండలంలోని గట్లమల్యాల యువసేన యూత్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కర్రే సంపత్, ఉపాధ్యక్షుడిగా రంగు ప్రమోద్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా గజ్వేల్లి రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా రంగు ప్రవీణ్, ముడికె అజయ్, కె. హరీష్, బసాని యాదగిరి నియమితులయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సంపత్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో యువతను ఐక్యంగా ఉంచుతూ సామాజిక, సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# మెదక్ చరిత్రను ప్రపంచానికి పరిచయం చేసిన టూరిజం డే

- మెదక్ ఎంపీ, జిల్లా కలెక్టర్‌కు అభినందనలు

**మెదక్ టౌన్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** మెదక్ జిల్లా చారిత్రక వైభవం, ఆధ్యాత్మిక విశిష్టత, ప్రకృతి అందాలు, సాంస్కృతిక సంపదను ప్రపంచానికి పరిచయం చేసే వేదికగా టూరిజం డే నిలిచింది. జిల్లా చరిత్ర, వారసత్వ సంపద, ప్రముఖ పర్యాటక ప్రాంతాల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేస్తూ నిర్వహించిన కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మెదక్ ఎంపీ, జిల్లా కలెక్టర్‌కు అభినందనలు వెల్లువెత్తాయి.

**చరిత్రకు నిలువెత్తు సాక్ష్యం....**

మెదక్ జిల్లాలో అనేక రాజవంశాలు, పాలకుల ఆనవాళ్లు కనిపిస్తాయి. మెదక్ కోట వంటి చారిత్రక కట్టడాలు జిల్లా గత వైభవానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి. పురాతన నిర్మాణ శైలి, వాటి వెనుక ఉన్న



చరిత్ర పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి.

**ఆధ్యాత్మికత.. ప్రకృతి అందాలు**

చారిత్రక ప్రదేశాలతో పాటు జిల్లాలోని ఆలయాలు, ప్రార్థనా స్థలాలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి. పచ్చని కొండలు, చెరువులు, జలవనరులు, గ్రామీణ వాతావరణం ప్రకృతి పర్యాటకులకు ప్రత్యేక అనుభూతిని అందిస్తున్నాయి. చారిత్రక ప్రాంతాలతో పాటు ప్రకృతి పర్యాటకాన్ని ప్రోత్సహిస్తే జిల్లాకు మరింత గుర్తింపు లభించే అవకాశం ఉంది.

**వారసత్వ పరిరక్షణకు పిలుపు**

చారిత్రక కట్టడాలు, పురాతన నిర్మాణాలు, సంప్రదాయ కళలు, స్థానిక సంస్కృతిని పరిరక్షించాల్సిన అవసరాన్ని టూరిజం డే గుర్తుచేసింది. యువతలో చరిత్ర, సంస్కృతిపై అవగాహన పెంచడంతో పాటు పర్యాటక ప్రాంతాలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. చరిత్ర, ఆధ్యాత్మికత, ప్రకృతి, సంస్కృతి సమ్మేళనమైన మెదక్‌ను దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించే కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశం ఉందని పేర్కొన్నారు. గత వైభవాన్ని కాపాడి భవిష్యత్ తరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా కార్యక్రమం చాటిచెప్పింది.

## వనదుర్గమ్మ సన్నిధిలో చైర్మన్



**పాపన్నపేట, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం. ఆదివారం అమ్మవారిని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అర్చకులు మాతకు విశేష పూజలు నిర్వహించి వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సిబ్బంది ఉన్నారు.

## నేడు ఆవుల రాజిరెడ్డి చేతుల మీదుగా చెక్కుల పంపిణీ

- నర్సాపూర్ పట్టణంలోని సాయి కృష్ణ గార్డెన్‌లో..



**కొల్చారం, సెప్టెంబర్ 27(జనంసాక్షి):** నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రెడ్డి సహకారంతో కొల్చారం మండలానికి 16 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు అయ్యాయని కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్ తెలిపారు. నేడు నర్సాపూర్ పట్టణంలోని సాయి కృష్ణ గార్డెన్ లో చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులను సాయి కృష్ణ గార్డెన్ కు తీసుకురావాలని నాగుల గారి మల్లేశం గౌడ్ కోరారు.

## వేల్పుగొండలో ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం



**టేక్మాల్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని వేల్పుగొండ శ్రీ తుంబురేశ్వర స్వామి ఆలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో ఆధ్వర్యంలో మహిళలు, వెలుగు సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది బతుకమ్మలు, బోనాలతో ఊరేగింపు చేపట్టారు. ప్రధాన అర్చకులు అరుణ్ శర్మ ఆధ్వర్యంలో పూలాభిషేకం, మహారుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం మహిళలు, చిన్నారులు బతుకమ్మ, కోలాటాలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కాకతీయుల కాలం నాటి ఆలయానికి చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, అర్చకులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## కొండాపూర్ మండల ఎంఆర్‌పీఎస్ నూతన కమిటీ ఏకగ్రీవ

- నూతన అధ్యక్షుడిగా ఎర్రోళ్ల సిమోన్



లక్ష్మారెడ్డిగూడెం సతీష్

**కొండాపూర్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) కొండాపూర్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నిర్వహించిన సమావేశానికి దేవరంపల్లి అశోక్ అధ్యక్షత వహించారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి రామారావు శ్రీనివాస్ మాదిగ, జిల్లా అధ్యక్షుడు బుచ్చంద్ర మాదిగ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.


**నూతన కమిటీ......**

అధ్యక్షుడుగా ఎర్రోళ్ళ సిమోన్
**ఉపాధ్యక్షుడు:** గౌడిచర్ల రమేష్
**ప్రధాన కార్యదర్శి:** గారకుర్తి ప్రవీణ్
**సహాయ కార్యదర్శులు:** సూర్యాపేట రాజు, లక్ష్మారెడ్డిగూడెం సతీష్

నూతన కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేస్తూ ఎంఆర్‌పీఎస్ కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో జార్జ్, శాంతయ్య, డేవిడ్, రమేష్, మాణిక్యం, రాజు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట ప్రయాణికులకు గుడ్ న్యూస్

- ఫోన్ కాల్‌తోనే బస్సు వేళలు తెలుసుకునే వెసులుబాటు



**చేర్యాల, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** ప్రయాణికుల సౌకర్యార్థం సిద్దిపేట ఆర్టీసీ బస్టాండ్‌లో విచారణ నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు సిద్దిపేట డిపో మేనేజర్ హెచ్. శ్రీనివాస్ తెలిపారు. ప్రయాణికులు బస్సుల రాకపోకలు, అందుబాటులో ఉన్న సర్వీసులు తదితర వివరాలు ఫోన్ ద్వారా తెలుసుకునేందుకు ఈ సౌకర్యం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ ఎంక్వయిరీ నెంబర్ 9491510310 ద్వారా ప్రయాణికులు తాము వెళ్లాల్సిన గమ్యస్థానానికి సంబంధించిన బస్సు ఎప్పుడు వస్తుందనే సమాచారాన్ని ఫోన్ చేసి తెలుసుకోవచ్చని డిపో మేనేజర్ తెలిపారు.ఆర్టీసీ అందించే సమయానుకూల సేవలు,ప్రయాణికులకు అవసరమైన ఇతర సమాచారాన్ని ఈ ఎంక్వయిరీ నంబర్ ద్వారా పొందే అవకాశం ఉంది ప్రతిరోజూ ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఎంక్వయిరీ నెంబర్ అందుబాటులో ఉంటుందని వెల్లడించారు.ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ నిరసన

- కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన కార్యక్రమం
- కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్



**కొల్చారం, సెప్టెంబర్ 27(జనంసాక్షి):** ఏఐసీసీ మరియు టీపీసీసీ ఇచ్చిన పిలుపు మేరకు, కేంద్ర ఎన్నికల కమిషనర్ శ్రీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష ధోరణికి నిరసనగా, ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో జరిగిన అక్రమాలు, అవకతవకలను నిరసిస్తూ మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ నిరసన కార్యక్రమం సి ఈ సి జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మ దహనం కలదు. కార్యక్రమంలో అన్ని గ్రామాల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ సర్పంచులు ఉప సర్పంచ్లు మండల కార్యవర్గ సభ్యులు , జిల్లా కార్యవర్గ సభ్యులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, యువజన కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాగుల గారి మల్లేశం గౌడ్ కోరారు.

# కల్హేర్ మండలంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభం

- రూ.20 లక్షలతో మహిళా సమైక్య భవనం, సీసీ రోడ్డు
- లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ







**కల్హేర్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** కల్హేర్ మండల పరిధిలోని కిష్టాపూర్, రాపర్తి గ్రామాల్లో నారాయణ ఖేడ్ శాసనసభ్యులు డా. పట్లోళ్ల సంజీవరెడ్డి ఆదివారం పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించారు. కిష్టాపూర్ గ్రామంలో MGNREGS నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన మహిళా సమైక్య భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలకు ఈ భవనం ఎంతో దోహదపడుతుందని అన్నారు. అనంతరం గ్రామంలోని ముత్యాల పోచమ్మ ఆలయం వద్ద రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. భక్తులకు, గ్రామ ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామానికి చెందిన లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.

అనంతరం రాపర్తి గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాపర్తి గ్రామం తమకు ఎంతో అభిమానమైన గ్రామమని, గతంలో తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పట్లోళ్ల కిష్టారెడ్డి హయాంలో కూడా రాపర్తి అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. కల్హేర్ మండలంలో పైలెట్ ప్రాజెక్టు కింద రాపర్తి గ్రామాన్ని ఎంపిక చేశామని, గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులు, సన్నబియ్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కిష్టాపూర్ సర్పంచ్ శశికళ తుకారం, గంగారం సర్పంచ్ కోడి గంగారం, బీబీపేట్ సర్పంచ్ తులసమ్మ సాయిలు, జమలతండా సర్పంచ్ గోవింద్ నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తుకారం, దేవదాస్, విఠల్, సంబంధిత శాఖల అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నల్లవాగుకు సింగూర్ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్

- రూ.70 కోట్లతో ప్రతిపాదనలు - ఎమ్మెల్యే సంజీవరెడ్డి



**కల్హేర్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** నల్లవాగును సస్యశ్యామలం చేసేందుకు సింగూర్ జలాశయం నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ చేపట్టేందుకు రూ.70 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు.

మంజీరా నదిపై లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పూర్తయితే సింగూర్‌లో నీళ్లు ఉంటే నల్లవాగులో నీళ్లు ఉన్నట్లేనని అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా నల్లవాగు పరివాహక రైతులకు సాగునీరు అందుతుందన్నారు. కల్హేర్, మార్డి, ఇంద్రానగర్ గ్రామాలకు నిరంతర తాగునీటి సరఫరా కోసం కూడా లిఫ్ట్ ఇరిగేషన్ చేపడతామని తెలిపారు.

**పోడు భూములకు పట్టాలు ఇప్పించండి...**

కల్హేర్ మండలం కృష్ణాపూర్ గ్రామ రైతులు మార్డి శివారు సర్వే నంబర్ 115లోని పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. పట్టాలు లేక రైతు భరోసా, ధాన్యం అమ్మకాల్లో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# రాయబాగిన్ రాజ్యం .. సంరక్షిస్తే సజీవం



**పాపన్నపేట, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** పురాతన రాతి కట్టడాలను సంరక్షించుకోవాలని పాపన్నపేట సర్పంచ్ పావని నరేందర్ గౌడ్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పాపన్నపేట లోని కుమ్మరి గైనీ వద్ద బురుజును ఎంపీడీఓ విష్ణువర్ధన్, గ్రామ ప్రజలతో కలిసి సందర్శించారు. రాయబాగిన్ రాణీ శంకరమ్మ పాలించిన ప్రాంతాన్ని ప్రభుత్వం,ప్రజల సహకారంతో సంరక్షిస్తే కట్టడాలు పదిలంగా ఉంటూ,భవిష్యత్ తరాలకు చరిత్రకు సాక్ష్యంగా విశేషాలు తెలుసుకొనే అవకాశం ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లాలో ఘణమైన సంస్థాన్ గత చరిత్రను గుర్తు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో అటవీ శాఖ రేంజ్ అధికారిణి హిమ చందన,బీట్ అధికారిణి శారద,పంచాయతీ కార్యదర్శి నయీమ్,పాపన్నపేట ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్,వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.

# ప్రజాపాలన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**కోహెడ, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కార్యకర్తలు కృషి చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శెట్టి సుధాకర్ సూచించారు. ఆదివారం బత్తులవానిపల్లి, నాగసముద్రాల, పోరెడ్డిపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఆరు గ్యారెంటీలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చూడాలన్నారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని నాయకులు తెలిపారు. సమావేశాల్లో గ్రామ కమిటీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# త్వరలో తెలంగాణ రక్షణ సేనలో భారీ చేరికలు



**తూప్రాన్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** రాబోయే రోజుల్లో తెలంగాణ రక్షణ సేనలో భారీ చేరికలు ఉంటాయని గజ్వేల్ ఇన్‌చార్జి కొట్టాల యాదగిరి తెలిపారు. తూప్రాన్‌లో పార్టీ జెండా ఆవిష్కరణ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాంచజన్య సూత్రాలతో ప్రజల్లోకి వెళ్తున్నామని పేర్కొన్నారు. ఉచిత విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, సామాజిక న్యాయం లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత నాయకత్వంలో పార్టీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎడ్ల నర్సింలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి మరింత బలం

- గుండుమాల్ మండల ఎంఆర్‌పీఎస్ నూతన కమిటీ ఎన్నిక
- అధ్యక్షుడిగా జోగు దస్తయ్య.. అధికార ప్రతినిధిగా గూని నరసింహ



**గుండుమాల్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్)ను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసే దిశగా గుండుమాల్ మండల నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గుండుమాల్ ఎస్సీ సామాజిక భవన ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి దళిత యువత, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

నారాయణపేట జిల్లా ఎంఆర్‌పీఎస్ ఇన్‌చార్జి మంద నరసింహ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం మందకృష్ణ మాదిగ మూడు దశాబ్దాలుగా కొనసాగించిన పోరాటాలను వివరించారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఎన్నో ఇబ్బందులు ఎదురైనా ఉద్యమాన్ని కొనసాగించారని, వర్గీకరణ సాధనలో మందకృష్ణ మాదిగ కీలక పాత్ర పోషించారని తెలిపారు.

నూతన కమిటీ సభ్యులు ఎంఆర్‌పీఎస్‌ను మండలంలో మరింత విస్తరించి, దళితుల హక్కుల సాధన కోసం ఐక్యంగా పనిచేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

**నూతన కమిటీ వివరాలు :** మండల అధ్యక్షుడు: జోగు దస్తయ్య, అధికార ప్రతినిధి: గూని నరసింహ, ప్రధాన కార్యదర్శులు: మాలేకాడి సిద్దు, హరిజన బాజరప్ప, కొమ్మూరు మైబు, మ్యాతరి గోపాల్, బందేరి శివయ్య, కోశాధికారి: జోగమొల్ల రాములు, కార్యదర్శులు: నల్లగాళ్ల కృష్ణయ్య, ద్యావరి శ్రీనివాస్, అమ్మికుంట్ల వెంకటయ్య, ఫిరంగి శివయ్య, సహాయ కార్యదర్శులు: మాలకాడి అంజిబాబు, గండీడు రామకృష్ణ, చెక్క బుగ్గప్ప, హరిజన రామకృష్ణ, పల్లె తిరుమలయ్య, కార్యవర్గ సభ్యుడు: డబ్బు దస్తయ్య

# జిల్లా ఉపాధ్యక్షుడిగా సతీష్ నియామకం



**పాపన్నపేట, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** భారతీయ జనతా యువ మోర్చా మెదక్ జిల్లా కార్యవర్గాన్ని అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు. ఇందులో భాగంగా మండల కేంద్రం పాపన్న పేట కు చెందిన సుంకరి సతీష్ ను బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈసందర్భంగా సుంకరి సతీష్ మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ బాధ్యతలు అప్పగించిన జిల్లా యువమోర్చా,భాజపా అధ్యక్షుడికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# 100 ఎక్కాలు అవలీలగా చెప్పిన విద్యార్థి అజయ్

- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఘన సన్మానం



**మల్దకల్, సెప్టెంబర్27(జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోరని,సరైన ప్రోత్సాహం అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కొనియాడారు.

గద్వాల జిల్లా మల్దకల్ మండలం పావనంపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల 5వ తరగతి విద్యార్థి అజయ్, 1 నుండి 100 వరకు గణిత ఎక్కలను ఎంతో అవలీలగా,వేగంగా పూర్తి చేసి అందరినీ విస్మయానికి గురిచేశాడు. విద్యార్థి అసాధారణ ప్రతిభను గుర్తించిన జిల్లా కలెక్టర్, గద్వాల జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఆదివారం అజయ్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించి,ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, అజయ్ లాంటి విద్యార్థుల ప్రతిభే అందుకు నిదర్శనమని అన్నారు. చిన్న వయస్సులోనే 100 ఎక్కాలను తడుముకోకుండా పూర్తి చేయడం అభినందనీయమని హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అజయ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ,విద్యార్థికి అవసరమైన పూర్తి సహకారాన్ని అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రజావాణి రద్దు

**వనపర్తి సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** ఈ నెల 28వ తేదీ సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం వనపర్తి జిల్లాలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సహచర మంత్రులతో కలిసి ఉమ్మడి జిల్లాకు సంబంధించిన రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి జిల్లా అధికారులు హాజరుకానున్న నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఈ మార్పును గమనించి సోమవారం ప్రజావాణి కోసం కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు.

# బ్యాంక్ ఉద్యోగుల సమ్మెకు సీపీఐ(ఎం) మద్దతు

• సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు



**సంగారెడ్డి, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** బ్యాంకు ఉద్యోగుల 5 రోజులు పని విధానాన్ని అమలు చేయాలని, పిఎల్ఐ పథకం అమలులో ఏకపక్ష ధోరణి, 12వ వేతన ఒప్పందంలోని డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నేటి నుండి (సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో) యుఎఫ్బియు తలపెట్టిన 3 రోజుల దేశవ్యాప్త సమ్మెకు సీపీఐ(యం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు మద్దతు తెలియచేశారు. ఆదివారం సిపిఎం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మద్దత్తు గా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ ఉద్యోగులు , అధికారుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బ్యాంకు ఉద్యోగులు చేస్తున్న ఈ 3 రోజుల సమ్మెను జిల్లా కార్మికవర్గమంతా విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) విజ్ఞప్తి చేశారు. 2023లో కుదిరిన ఒప్పందాలను ఆమోదించకుండా, బ్యాంకుల లాభాల ఆధారంగా ఇవ్వాల్సిన ఇన్సెంటివ్లలో ఏకపక్ష మార్పులు చేస్తూ ఉద్యోగుల్లో కేంద్ర ప్రభుత్వం విభజన సృష్టిస్తోందన్నారు.. గత 60 సంవత్సరాలుగా అమలవుతున్న ద్వైపాక్షిక ఒప్పందాలను విచ్ఛిన్నం చేస్తూ, ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించడం వల్ల ఉద్యోగుల ఉపాధికి భద్రత లేకుండా పోతోందని అన్నారు.దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకులను శరవేగంగా ప్రైవేటు పరం చేస్తూ, 28 బ్యాంకులను 12కి కుదించడంతో పాటు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను కూడా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలని యత్నిస్తున్నదన్నారు.కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికవర్గం ఏకోన్ముఖంగా ప్రతిఘటించాలని ప్రజలకు సీపీఐ(ఎం) విజ్ఞప్తి చేశారు.

# పోరాట స్ఫూర్తికి ప్రతీక కొండా లక్ష్మణ్ బాపూజీ



**మెదక్ అర్బన్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగం, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని మాజీ మున్సిపల్ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఐసీఐసీఐ బ్యాంక్ సమీపంలో బాపూజీ జయంతి నిర్వహించి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ కోసం మంత్రి పదవికి రాజీనామా చేసిన గొప్ప తెలంగాణవాది బాపూజీ అని కొనియాడారు. బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా జీవితాంతం పోరాడారని తెలిపారు. ఆయన సేవలకు గుర్తింపుగా బాపూజీ పేరుతో తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడం గౌరవమన్నారు. ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తిని కొనసాగించడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

# పామిరెడ్డిపల్లి వైరాగ్యగిరికి మహర్దశ

### అక్టోబర్ 12 నుంచి గిరిప్రదక్షిణకు శ్రీకారం: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి బ్యూరో/ పెద్దమందడి సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** పామిరెడ్డిపల్లి గ్రామంలోని శ్రీ వైరాగ్యగిరీశ్వర స్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి, భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాలా సహకరిస్తానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. ఆదివారం పామిరెడ్డిపల్లిని సందర్శించిన ఆయన వైరాగ్యగిరి చుట్టూ గిరిప్రదక్షిణ కోసం అభివృద్ధి చేసిన మార్గాన్ని పరిశీలించారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచ్‌తో కలిసి గిరిప్రదక్షిణ మార్గంలో భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర ఏర్పాట్లపై ఎమ్మెల్యే చర్చించారు. ఆలయ ఆధ్యాత్మిక ప్రాశస్త్యం, చారిత్రక నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. అక్టోబర్ 12న గిరిప్రదక్షిణ మార్గ సంప్రోక్షణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను ముందుగానే పరిశీలించారు. వేదపండితుల సూచనలు, గ్రామస్తుల ఆకాంక్షలకు అనుగుణంగా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని సూచించారు. అరుణాచలం తరహాలో పామిరెడ్డిపల్లి వైరాగ్యగిరి గిరిప్రదక్షిణకు భక్తుల రాక పెరిగేలా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గతంలో కెనాల్ పనులు పూర్తయిన సందర్భంగా వచ్చిన తొలి నీటితో పరమశివుడికి అభిషేకం చేసిన విషయాన్ని గుర్తుచేసుకున్న ఎమ్మెల్యే.. అప్పట్లో ఇచ్చిన మాట ప్రకారం వైరాగ్యగిరీశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

# కన్నతండ్రిని హతమార్చిన కసాయి కొడుకు



**నవాబుపేట, సెప్టెంబర్ 27(జనంసాక్షి):** మండలంలో చోటు చేసుకుంది. నవాబుపేట్ మండల దేపల్లి గ్రామంలో తండ్రిని కొట్టి చంపిన ఘటన స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాపోలు రాములు (55) ను రెండవ కొడుకు కొట్టి హత్య చేశాడు. కొడుకు రాపోల్ సురేందర్ ప్రతిరోజు తాగి ఖాళీగా తిరుగుతూ ఉన్నాడని తండ్రి మందలించేవాడు. అది మనసులో పెట్టుకొని తండ్రిని ఎలాగైనా చంపాలనే ఉద్దేశంతో శనివారం సాయంత్రం కర్రతో, రాయితో తలపై బలంగా కొట్టడం జరిగింది. తలపై గాయాలు తో తండ్రి రాపోలు రాములు వాకిట్లో పడిపోయాడు. అది గమనించిన ఇంటి పక్కన ఉన్నవారు రాపోలు జంగయ్య, రాపోల్, నరసింహులు, చూసి రక్తపు గాయాలతో ఉన్న రాములు, ఇంట్లోకి తీసుకెళ్లి పరిశీలించగా అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. స్థానికులు మృతుడి పెద్దకొడుకుకు ఫోన్ చేసి విషయాలను తెలుపగా పెద్ద కొడుకు రాపోల్ శ్రీకాంత్ వచ్చి తండ్రిని చూసేలోపు నిందితుడు సురేందర్ పరారయ్యాడు. తండ్రి చావు కి కారణమైన తమ్ముడు సురేందర్ పై చర్యలు తీసుకోవాలని మృతుని పెద్ద కొడుకు శ్రీకాంత్ పోలీసులకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు.

# పరిశ్రమల్లో ఏమి జరిగినా పట్టించుకోని అధికారులు



బాయిలర్ ఆపరేటర్ లైసెన్స్ ఉన్నవాళ్లు హైదరాబాద్ లో ఇక్కడ వందల మంది కార్మికులు పని చేసే పరిశ్రమలో ఎటువంటి ప్రభుత్వ గుర్తింపు లేని, కేవలం అనుభవం ఉన్న బీహార్ కూలీలు బాయిలర్ ఆపరేటర్లు, బాయిలర్ నాణ్యతను పరిశీలించి ప్రతి సంవత్సరం ఫిట్నెస్ సర్టిఫికెట్ ఇవ్వవలసిన బాయిలర్ ఇన్స్పెక్టర్ తనిఖీ కాగితాల వరకేనా? ఇలా పరిశ్రమలకు అనుమతులు ఇచ్చే అధికారులు వాటిని ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడిచేలా చూడటంలో విఫలమవుతున్నారు. దానికి నిదర్శనమే పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు అమాయక కార్మికులు బలవుతున్నారు.

కొన్ని రసాయనిక పరిశ్రమలకు అనుమతులు ఒక రసాయన పదార్థానికి ఉంటే, అనుమతులు లేని రసాయన పదార్థాలు తయారు చేస్తున్నా (డ్రగ్స్) అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారా ? పరిశ్రమలు నెలకొల్పడానికి హడావుడి చేసిన ప్రభుత్వాలు పరిశ్రమల నుండి ప్రజలకు జరిగే నష్టాన్ని నివారించేందుకు కఠినమైన చట్టాలు, చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### ఖిల్లా కోటను
# పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి





ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థులు, యువతలో చరిత్రపై ఆసక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఎమ్మెల్యే, కలెక్టర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వినోద్‌కుమార్, డీవైఎస్ఓ సుధీర్‌రెడ్డి, సీపీఓ హరికృష్ణ, తహశీల్దార్ సుగుణ, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ...** వనపర్తి జిల్లాలో చారిత్రక, ప్రకృతి అందాలతో కూడిన అనేక పర్యాటక ప్రాంతాలున్నాయని తెలిపారు. వాటి విశిష్టత, చారిత్రక నేపథ్యం, ప్రకృతి సౌందర్యాన్ని ప్రజలకు పరిచయం చేసేందుకు ట్రెకింగ్ నిర్వహించినట్లు చెప్పారు.

# శ్రీరంగాపూర్‌కు రూ.2.25 కోట్లతో తహసీల్దార్ కార్యాలయం





**శ్రీరంగాపూర్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 2.25 కోట్లు మంజూరు చేసింది. రెవెన్యూ శాఖ G.O.Rt.No.597 ద్వారా శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆధునిక వసతులతో భవనం నిర్మాణం చేపట్టనున్నారు. దీంతో మండల ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత సౌకర్యవంతంగా అందనున్నాయి. భవనం మంజూరుకు కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే చొరవతో భవనం మంజూరు కావడంపై శ్రీరంగాపూర్ మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# జాతీయస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ వెళ్లిన విద్యార్థులు



**మల్దకల్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు వరల్డ్ టూరిజం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం హైదరాబాదులోని సిఎస్ఐఆర్ -ఎన్జీఆర్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒకరోజు జాతీయస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా అక్కడ విద్యార్థులు భూకంపాలు, సునామీలు ఏ విధంగా వస్తాయి వాటి రాకను ముందే ఏవిధంగా పసిగట్టవచ్చు. భూగర్భ జలాలను ఏ విధంగా గుర్తించవచ్చు,భూమిలో ఉన్న వివిధ రకాల పొరల అధ్యయనం లోహాలు,గ్యాస్ నిక్షేపాలను గుర్తించే విధానాలపై అక్కడి ప్రదర్శనలు సందర్శించి ప్రత్యక్ష అనుభవాలను పొందడం జరిగింది.ఈ కార్యక్రమం విద్యార్థులకు సైన్స్ పై మక్కువ ఏర్పడడానికి అవకాశం ఉంటుందని,భూకంపాలు సునామీలు భూగర్భ జలాల పై భూమిలోని వివిధ రకాల పొరలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఉపయోగపడుతుందని ప్రిన్సిపల్ శ్రీలత రెడ్డి తెలిపారు. విద్యార్థులవుతోపాటు అధ్యాపకులు రామాంజనేయులు గౌడ్, శ్రీకాంత్,సుధాకర్, అధ్యాపకేతర సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఉల్లాస పరీక్షలకు
# 612 మంది మహిళలు



**ఉప్పునుంతల, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** మహిళల్లో అక్షరాస్యత పెంపునకు 'ఉల్లాస-అమ్మకు అక్షరమాల' కార్యక్రమంలో భాగంగా మండలవ్యాప్తంగా పరీక్షలు నిర్వహించారు. 27 పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో 612 మంది మహిళా సంఘాల సభ్యులు హాజరయ్యారు. నిరక్షరాస్య మహిళలకు చదువు నేర్పిన అనంతరం వారి అభ్యసన స్థాయిని తెలుసుకునేందుకు పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీవో వరుణ్‌తేజ్, డీపీఎం చెన్నయ్య, ఏపీఎం బాలచందర్ పర్యవేక్షించారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు ఆదర్శనీయం

## జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 27(జనంసాక్షి):** తెలంగాణ ఉద్యమ నేత, స్వాతంత్ర్య సమర యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ సామాజిక న్యాయం, సమానత్వం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు.
సంగారెడ్డిలోని ఫ్రూట్ రీసెర్చ్ స్టేషన్ వద్ద ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద ఆదివారం జయంతి వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాపూజీ ఆశయాలను నేటి తరాలు ఆదర్శంగా తీసుకుని సమాజ సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత, బీసీ సంక్షేమ అధికారి జగదీష్, అధికారులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో నిర్లక్ష్యం.. అవినీతి ఆరోపణలు

## నిజాంపేట్ ఎంపీఓ సురేష్ సస్పెన్షన్



**నిజాంపేట్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అధికారుల ఆదేశాల ఉల్లంఘన, అవినీతి ఆరోపణల నేపథ్యంలో నిజాంపేట్ మండల పంచాయతీ విస్తరణ అధికారి (ఎంపీఓ) సురేష్ సస్పెండ్ అయినట్లు సమాచారం. జిల్లా అధికారుల నివేదిక మేరకు పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. జనవరి నుంచి జూలై వరకు అభివృద్ధి పనులకు అడ్డంకులు కల్పించారని, ఎంపీడీవో ఆదేశాలను పాటించలేదని ఫిర్యాదులు ఉన్నట్లు సమాచారం. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల వద్ద డబ్బులు డిమాండ్ చేశారనే ఆరోపణలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో న్యాల్కల్, వికారాబాద్ జిల్లాల్లో పనిచేసిన సమయంలోనూ అవకతవకలు, అధికారులతో వివాదాల నేపథ్యంలో సస్పెన్షన్‌కు గురైనట్లు అధికారులు పేర్కొన్నట్లు సమాచారం.

# కూచారం గ్రామంలో అభివృద్ధి వైపు అడుగులు

- గ్రామ సర్పంచ్ రాజనాల చిత్ర రఘు
- గ్రామసభలో అభివృద్ధి పనులపై సుదీర్ఘ చర్చ



**మనోహరాబాద్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** మనోహరాబాద్ మండల పరిధిలో కూచారం గ్రామంలో సర్పంచ్ రాజనాల చిత్ర రఘు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు గ్రామంలో అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నామని గ్రామసభలో అభివృద్ధి పనులపై సుదీర్ఘ చర్చించి ప్రత్యేక ప్రణాళికలతో అదేవిధంగా ప్రభుత్వం అందించే పథకాలు గ్రామ ప్రజలందరికీ అందేలా కృషి చేస్తామన్నారు స్థానిక సమస్యలపై చర్చించారు ఉపాధి హామీ పనులపై సమీక్షించి ప్రతి ఒక్కరికి ఉపాధిని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు ఈ సమావేశంలో పాలకవర్గ సభ్యులు వివిధ శాఖల అధికారులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన వినాయక నిమజ్జనం

## పటిష్ట బందోబస్తు.. పోలీసుల పర్యవేక్షణ




**కోహిర్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** కోహిర్ మండలంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం రాత్రి నిమజ్జనంతో ప్రశాంతంగా ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణనాథులను భక్తులు శోభాయాత్రలుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. డప్పులు, భజనలు, నృత్యాలతో యువత సందడి చేయగా, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నిమజ్జనాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, మండపాలు, శోభాయాత్ర మార్గాల్లో నిరంతరం పర్యవేక్షించారు. వినాయక కమిటీ నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ భద్రతా చర్యలు చేపట్టారు. ఎస్సై నరేష్ సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముందస్తు జాగ్రత్తలతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిమజ్జనం ప్రశాంతంగా పూర్తయింది.

# పీఆర్‌టీయూ మండలశాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక




**టేక్మాల్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** టేక్మాల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో పీఆర్‌టీయూ-టీఎస్ మండల శాఖ సర్వసభ్య సమావేశం, 2026-28 ఎన్నికలు నిర్వహించారు. 12 పోస్టులకు 12 నామినేషన్లు రావడంతో కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా ఎండీ అమీరుద్దీన్ నాలుగోసారి, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ సహదేవ్ ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులుగా ఎస్. శ్రీకాంత్‌రెడ్డి, ఎస్. ప్రియాంక, ఉపాధ్యక్షులుగా నాయకం శ్రీకాంత్, బి. అశోక్, బి. శ్వేత, ఎం. రవళి, కార్యదర్శులుగా టీ. నరేష్, ఎస్. శివ, ఏ. నాగరాణి, హర్ష ఫాతిమా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులు పంతులు రాజు, బాలకిషన్ వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా నాయకులు అభినందించారు.

# పనులు ఆపేశారు సరే.. పూర్తిచేసేది ఎప్పుడు?

## అసంపూర్తి పనులతో పశు వైద్యానికి పాట్లు

**న్యాల్‌కల్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** న్యాల్‌కల్-రామతీర్థం, మాణిక్ నగర్, వ్యవసాయ పొలాలకు వెళ్లే దారి మరమ్మతు, వరద నీటి పైప్‌లైన్ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో పశుపోషకులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు సమీపంలోని పశువైద్య కేంద్రానికి వెళ్లే ఏకైక మార్గం వద్ద పనులు నిలిచిపోవడంతో నెలరోజులుగా పశువులను వైద్యం కోసం తీసుకెళ్లడం కష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

### ప్రమాదకరంగా పశువైద్య కేంద్రం ముఖద్వారం

కేంద్రం ప్రధాన ద్వారం వద్ద ఒకవైపు లోతట్టు ప్రాంతం, మరోవైపు అసంపూర్తి పనులు ఉండటంతో పశువులతో రాకపోకలు ప్రమాదకరంగా మారాయి. టేకూర్, ముంగి, తాటిపల్లి, మిర్జాపూర్ (ఎన్), ఇబ్రహీంపూర్, రాయికోడ్ మండల పరిధి గ్రామాల నుంచి కూడా పశుపోషకులు ఇక్కడికి వస్తుంటారు. శనివారం పలువురు రైతులు గేదెలు, ఆవులు, ఎద్దులు, మేకలను చికిత్స కోసం తీసుకురాగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పశువైద్యాధికారి డాక్టర్ సంజయ్ తెలిపారు. కేంద్ర పరిధిలో 543 ఆవులు, 506 గేదెలు, 1,067 మేకలు, 2,200 గొర్రెలు ఉన్నాయని, రోజుకు 20-25 మంది పశుపోషకులు చికిత్స కోసం వస్తుంటారని చెప్పారు.



### రూ.5 లక్షల పంచాయతీ నిధులతో పనులు

రైతులు, మాణిక్‌నగర్ కాలనీవాసులు, బీసీ బాలికల వసతిగృహం, వరద నీటి సమస్య పరిష్కారానికి రూ.5 లక్షల గ్రామపంచాయతీ నిధులతో పనులు ప్రారంభించినట్లు మండల పీఆర్ ఏఈ సీహెచ్ మహేష్ తెలిపారు.

### త్వరలో పనులు పూర్తి చేస్తాం

పైప్‌లైన్ ద్వారా వరద నీటిని తరలించే పనులు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో పరిశీలించి నిలిపివేశామని ఏఈ తెలిపారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీరు సురక్షితంగా దిగువకు వెళ్లేలా త్వరలో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. పశుపోషకులు, వైద్య సిబ్బంది, రైతులు, కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# బీఎస్ఆర్ కాలనీ గణేష్ లడ్డు రూ.1.90 లక్షలు



**అమీన్‌పూర్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** పటేల్‌గూడ బీఎస్ఆర్ కాలనీలో తొమ్మిది రోజుల పాటు గణనాథుడికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. నిమజ్జనానికి ముందు నిర్వహించిన లడ్డు వేలంలో కాలనీ అధ్యక్షుడు సల్వాజి సోమేశ్వర్‌రావు రూ.1.90 లక్షలకు ప్రసాదాన్ని దక్కించుకున్నారు. అనంతరం డప్పులు, నృత్యాలు, జయ జయధ్వానాలతో శోభాయాత్ర నిర్వహించి గణనాథుడిని ఘనంగా నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మహిళలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం



**సదాశివపేట, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు మునిపల్లి విశ్వనాథం అన్నారు. బస్టాండ్ వద్ద ఆయన ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించి విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం కౌన్సిలర్ బిట్ల నికిత ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు, పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

# బస్వాపూర్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి



**కోహెడ, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** బస్వాపూర్ లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాధనలో బాపూజీ పాత్ర, త్యాగాలను నాయకులు కొనియాడారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సంఘం నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆర్ఐ డానియెల్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాపూజీ సేవలను స్మరించుకున్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం జీవితాంతం పోరాడిన గొప్ప ప్రజా నాయకుడని కొనియాడారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల సాధన, సహకార రంగం బలోపేతానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు రాజశేఖర్‌రెడ్డి, ఆర్ఎస్ఐలు శ్రీశైలం, అశోక్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గాగిల్లాపూర్‌లో ఉల్లాస్ వయోజన విద్యా పరీక్ష



**బెజ్జంకి, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):**
తెలంగాణ ప్రభుత్వం వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా బెజ్జంకి మండలం గాగిల్లాపూర్ గ్రామంలో ఆదివారం వయోజన విద్యా పరీక్ష నిర్వహించారు. గ్రామంలో నిరక్షరాస్యతను నిర్మూలించాలనే లక్ష్యంతో మహిళా సంఘాల ఆధ్వర్యంలో వృద్ధులు,నిరక్షరాస్యులకు గత కొన్ని రోజులుగా అక్షరాలు, లెక్కలు, సంతకం చేయడం తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన వారికి పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ ఎర్రల జానకి రాజు, ఉప సర్పంచ్ చింతలపల్లి పద్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎర్రల జానకిరాజు మాట్లాడుతూ చదువు నేర్చుకోవడానికి వయస్సు అడ్డంకి కాదని, ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించాలని అన్నారు. పరీక్షకు హాజరైన వృద్ధులను అభినందించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వీఓ అధ్యక్షురాలు ముత్యం శోభ,సీఏ కొమిరె మంజుల,మహిళా సంఘాల సభ్యులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

## అయూబ్‌ఖాన్‌కు మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్ష బాధ్యతలు



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** వనపర్తి జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా అయూబ్‌ఖాన్ నియమితులయ్యారు. డీసీసీ అధ్యక్షుడు శివసేనరెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్యే మేఘారెడ్డితో కలిసి అయూబ్‌ఖాన్‌కు నియామక పత్రాలు అందజేసి సన్మానించారు. మైనారిటీ సెల్‌ను బలోపేతం చేయడంతో పాటు జిల్లాలో పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయాలని శివసేనరెడ్డి సూచించారు. మైనారిటీ వర్గాల సంక్షేమం, సాధికారత కోసం కృషి చేస్తూ పార్టీ సంస్థాగత బలోపేతానికి తోడ్పడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్‌గౌడ్, కోట్ల రవి, కౌన్సిలర్ ధనలక్ష్మి, ప్రధాన కార్యదర్శి బ్రహ్మం, ఎండీ బాబా, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణుల ఐక్యతకు బాస్ బలమైన అడుగు



**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** బ్రాహ్మణుల ఐక్యత, సామాజిక చైతన్యం, అభివృద్ధి లక్ష్యంగా బాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చైతన్య యాత్రలో భాగంగా అలంపూర్‌లో జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు మోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ వివిధ బ్రాహ్మణ సంఘాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి సమన్వయం, పరస్పర సహకారాన్ని పెంపొందిస్తున్నట్లు తెలిపారు. విద్యా, ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అక్టోబర్ 25న మహబూబ్‌నగర్‌లో సుమారు 2,500 మందితో భారీ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో చైతన్య కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు.

## పేటలో ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



**పెద్ద శంకరంపేట్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** పెద్ద శంకరంపేట లోని మార్కండేయ మందిరంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.. ఆయన చేసిన సేవలు గురించి పలువురు కొనియాడారు.. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం బాధ్యులు జంగం రాములు. గుజ్జరీ నారాయణ. శ్రీనివాస్. శ్రీధర్. సిద్ధు. తదితరులు పాల్గొన్నారు..

## గడికోటలో పర్యాటక దినోత్సవ వేడుకలు



**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా రాణి శంకరమ్మ గడికోటలో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఆకట్టుకున్న ప్రదర్శనలను అధికారులు అభినందించారు. చారిత్రక కట్టడాలను పరిరక్షించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో షాకీర్ అలీ, ఎస్సై ప్రవీణ్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జంగం రేణుక, ఉపసర్పంచ్ రాజుగౌడ్, మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## తూప్రాన్‌లో సీనియర్ ఖో-ఖో జిల్లా జట్ల ఎంపిక



**తూప్రాన్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** మెదక్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ ఖో-ఖో జిల్లా జట్ల ఎంపికలు తూప్రాన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 277 మంది క్రీడాకారులు హాజరై ప్రతిభను ప్రదర్శించారు. వచ్చే నెల నల్గొండ జిల్లా హాలియాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే మెదక్ జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా జనరల్ సెక్రటరీ బి. శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ ఖో-ఖోకు జిల్లాలో మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించి మరిన్ని అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



**తూప్రాన్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పదవులను సైతం త్యాగం చేసి, జీవితాన్ని ప్రజా ఉద్యమాలకు అంకితం చేసిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. తూప్రాన్ పట్టణంలో ఆదివారం పద్మజ్యోతి సంఘం ఆధ్వర్యంలో ఆయన 111వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాచారం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, బొడ్డు నాగభూషణం, నందాల దుర్గాప్రసాద్, తాటి లచ్చల్, స్వర్గం వెంకటనారాయణ, కొక్కొండ దీపక్‌రెడ్డి, కౌన్సిలర్ రాముని‌గారి చిన్న నాగరాజుగౌడ్, బొంది సిద్దిరాములు గౌడ్, జిన్నా భగవాన్‌రెడ్డి, బ్రిటానియా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మరి సంఘం యువజన అధ్యక్షుడిగా ఎస్. రామకృష్ణ



**వనపర్తి, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం జిల్లా యువజన అధ్యక్షుడిగా ఎస్. రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యువజన ప్రధాన కార్యదర్శిగా ఎస్. రాముడు, కోశాధికారిగా ఎస్. రాంబాబు, ఉపాధ్యక్షుడిగా ఎస్. తేజ, కార్యదర్శిగా జి. ఎల్లస్వామి ఎన్నికయ్యారు. యువతను చైతన్యపరిచి సంఘాన్ని బలోపేతం చేయడంతో పాటు సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి పరశురాముడు సూచించారు.

## గద్వాలలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి



**గద్వాల, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమాల్లో బాపూజీ సేవలు చిరస్మరణీయమని అన్నారు. కలెక్టరేట్‌లో బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలోనూ వేడుకలు నిర్వహించి చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో అధికారులు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

## తక్కువ ఎత్తులో విమాన సర్వే.. ఆందోళన వద్దు

**ఆత్మకూర్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** వనపర్తి, నారాయణపేట, గద్వాల, మహబూబ్‌నగర్ జిల్లాలతో పాటు కర్ణాటకలోని రాయచూర్ పరిధిలో తక్కువ ఎత్తులో విమానం సంచరించనుందని ఎస్సై వి.జయన్న తెలిపారు. ఐఐసీ టెక్నాలజీస్ సంస్థ మల్టీ సెన్సార్ ఏరియల్ సర్వే కోసం 80 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో సర్వే పరికరాల క్యాలిబ్రేషన్ నిర్వహిస్తోందన్నారు. రాయచూర్ సమీపంలోని తాత్కాలిక ఎయిర్‌ఫీల్డ్ నుంచి కార్యకలాపాలు సాగుతాయని తెలిపారు. చిన్న విమానం కావడంతో పెద్దగా శబ్దం ఉండదని, తక్కువ ఎత్తులో కనిపించడం వల్ల ప్రజలు ఆందోళన చెందవద్దని సూచించారు. సంబంధిత అధికారులకు ముందస్తు సమాచారం ఇచ్చిందని పేర్కొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులపై రాజకీయం తగదు



**శివ్వంపేట, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** స్మార్ట్ రేషన్ కార్డుల పిన్ నంబర్ల ప్రింటింగ్‌లో జరిగిన తప్పులపై కొందరు నాయకులు రాజకీయం చేయడం తగదని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బుర్ర మురళీ గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాంకేతిక లోపాలను సంబంధిత అధికారులు సరిదిద్దుతారని తెలిపారు. గత బీఆర్‌ఎస్ పాలనలో కొత్త కుటుంబాలకు రేషన్ కార్డులు మంజూరు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 16,32,810 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి 61 లక్షల మందికి ఆహార భద్రత కల్పించిందన్నారు. స్మార్ట్ కార్డుల్లో తప్పుల విషయాన్ని తమ పంచాయతీ నుంచి తహసిల్దార్ కమలాద్రికి తెలియజేశామని, త్వరలో సవరిస్తామని అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. ప్రతిపక్ష నాయకులు ప్రతి అంశాన్ని రాజకీయంగా చూడటం సరికాదని సూచించారు.

## దుర్వాసనతో బెజ్జంకి మండల ప్రజల అవస్థలు

### ఇథనాల్ ఫ్యాక్టరీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**బెజ్జంకి, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** మండల పరిధిలోని ఇథనాల్ ఫ్యాక్టరీల నుంచి వస్తున్న దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా వాసన వస్తుండటంతో ఇళ్లలో ఉండటం కష్టంగా మారిందన్నారు. భోజనం చేసే సమయంలో వాంతులు, చీదర, గోకుడు వంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. దుర్వాసన భరించలేక తలుపులు, కిటికీలు మూసుకుని, ముక్కులు మూసుకోవాల్సి వస్తోందన్నారు. సమస్యపై అధికారులు స్పందించి ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇథనాల్ ఫ్యాక్టరీల నుంచి వెలువడుతున్న దుర్వాసనపై సమగ్ర పరిశీలన చేసి, నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## బెజ్జంకిలో బీర్ కంపెనీకి అనుమతులు ఇవ్వొద్దు

### అఖిలపక్ష పార్టీల డిమాండ్.. అనుమతిస్తే ఉద్యమం



**బెజ్జంకి, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** మండల కేంద్రంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. గుగ్గిళ్ల, పోతారం శివార్లలోని ఇథనాల్ కంపెనీల దుర్వాసనతో 15 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నాయకులు ఆరోపించారు. ప్రజల ఆరోగ్యంపై సమగ్ర విచారణ జరిపి నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకముందే బీర్ కంపెనీకి అనుమతులు ఇవ్వొద్దని కోరారు. అనుమతిస్తే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## సేవాదళ్ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ



**వనపర్తి, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** సేవాదళ్ ఆధ్వర్యంలో ప్రతినెల చివరి ఆదివారం నిర్వహించే జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డి జెండాను ఆవిష్కరించారు. కాంగ్రెస్ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. గాంధీ, నెహ్రూ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజాసేవలో ముందుండాలని కోరారు. కార్యక్రమంలో సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు గొర్ల జానకిరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మాచారి, మండల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉల్లి ధరలకు రెక్కలు.. కొనాలంటేనే జంకుతున్న జనం!

- తెల్ల ఉల్లి రూ.80-90.. ఎర్ర ఉల్లి రూ.60-70
- సరఫరా తగ్గడంతో పెరిగిన ధరలు.. పండుగల వేళ మరింత పెరిగేనా?



**కోహీర్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** ఉల్లి ధరలు క్రమంగా పెరుగుతుండటంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. కోహీర్ మార్కెట్‌లో ప్రస్తుతం తెల్ల ఉల్లి కిలో రూ.80 నుంచి రూ.90, ఎర్ర ఉల్లి రూ.60 నుంచి రూ.70 వరకు విక్రయమవుతోంది. దీంతో వినియోగదారులు కిలో కొనుగోలు చేయాలా, తక్కువ మోతాదుతో సరిపెట్టుకోవాలా అని ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది.

**వంటింటిపై ధరల ప్రభావం**

ఉల్లి ధర పెరగడంతో రోజువారీ కూరగాయల బడ్జెట్ భారమవుతోందని వినియోగదారులు చెబుతున్నారు. రోజువారీ కూలీలు, చిరు వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాలపై ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. గతంలో కిలోల చొప్పున కొనుగోలు చేసిన వారు ప్రస్తుతం అరకిలో, పావుకిలోతో సరిపెట్టుకుంటున్నారని పలువురు పేర్కొన్నారు.

**సరఫరా తగ్గడంతోనే పెరుగుదల**

కొన్ని ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఉల్లి దిగుబడి తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక నుంచి మార్కెట్లకు వచ్చే సరఫరా తగ్గడంతో ధరలు పెరిగినట్లు వివరిస్తున్నారు. మార్కెట్‌లో సరుకు లభ్యత తగ్గితే డిమాండ్‌కు అనుగుణంగా ధరలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.

**పండుగల వేళ మరింత పెరిగేనా?**

పండుగల సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో ఉల్లికి డిమాండ్ పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. సరఫరా ఆశించిన స్థాయిలో లేకపోతే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో పండుగ ఖర్చులకు తోడు కూరగాయల ధరలు కూడా అదనపు భారంగా మారుతున్నాయి. ఉల్లి ధర పెరగడం రైతులకు కొంత మేలు చేసినప్పటికీ వినియోగదారులపై భారం పడుతోందని పలువురు అంటున్నారు. సరఫరా పెంచి ధరలను నియంత్రించాలని, మార్కెట్‌లో కొనుగోలు, విక్రయ ధరలపై అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

# కొండ లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి



**సదాశివపేట, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** ప్రత్యేక తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు కొండ లక్ష్మణ్ బాపూజీ అని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద నిర్వహించిన బాపూజీ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం బాపూజీ జీవితాంతం పోరాడారని తెలిపారు. పదవుల కంటే ప్రజల ఆకాంక్షలకు ప్రాధాన్యమిచ్చారని పేర్కొన్నారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ఏటా జయంతి వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం, చేనేత సహకార సంఘం నాయకులు, కౌన్సిలర్ ఫణికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపై దాడి.. కొడుకు, కోడలిపై కేసు నమోదు

**ఉప్పునుంతల, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** కుటుంబ, ఆస్తి వివాదాల నేపథ్యంలో తల్లిపై దాడి చేసి గాయపరిచిన కొడుకు, కోడలిపై కేసు నమోదు చేసినట్లు ఉప్పునుంతల ఎస్సై పుట్ట మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని లత్తీపూర్ గ్రామానికి చెందిన కడారి ఎల్లమ్మపై ఆమె కొడుకు పర్వతాలు, కోడలు రేణుక దాడి చేసినట్లు ఫిర్యాదు అందిందన్నారు. ఈ నెల 26న ఉదయం సుమారు 8 గంటల సమయంలో ఎల్లమ్మ ఇంటికి వెళ్తుండగా అడ్డగించి దూషించి, కింద పడవేసి, రాయితో తొడపై కొట్టి, తన్నడంతో పాటు దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. గాయపడిన ఎల్లమ్మకు అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో, అనంతరం బాలాజీ ఆసుపత్రిలో చికిత్స అందించారని వివరించారు. వైద్య చికిత్స అనంతరం ఈ నెల 27న అందిన ఫిర్యాదు మేరకు కొడుకు పర్వతాలు, కోడలు రేణుకపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుట్ట మహేష్ వెల్లడించారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



**మాగనూరు, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** మాగనూరు శివారులోని అభిషేక్ దాబా సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కావలి బాబయ్య (29) మృతి చెందాడు. గుడేబలూరు నుంచి మాగనూరుకు బైక్‌పై వస్తుండగా అదుపుతప్పి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు మాగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

# ఎన్ఏటీఎస్ బోర్డు డైరెక్టర్ సాయిప్రసాద్‌కు సన్మానం



**వనపర్తి, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** ఉత్తర అమెరికా తెలుగు సంఘం (ఎన్ఏటీఎస్) బోర్డు డైరెక్టర్, వనపర్తి జిల్లా వాసి పి. సాయిప్రసాద్‌ను సాహితీ కళా వేదిక ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అమెరికాలోని కొలరాడో యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సాయిప్రసాద్ తొలిసారి వనపర్తికి రావడంతో శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. వనపర్తి ప్రాంతానికి చెందిన అమెరికా వాసులు, విద్యార్థులకు ఆయన సహాయసహకారాలు అందిస్తున్నారని కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ తెలిపారు. కొలరాడోలో తెలుగు కళాకారులను ఆహ్వానించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సాయిప్రసాద్ తెలిపారు. మాతృభూమి, మాతృభాషపై ఎప్పటికీ గౌరవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళా వేదిక సభ్యులు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపల్లిలో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ

**కొత్తపల్లి, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** వాల్యానాయక్ తండాలో బీఆర్ఎస్ జెండాను మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆయన బైక్ ర్యాలీలో పాల్గొని తండాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. గిరిజనులకు మంత్రి పదవి కల్పించాలని ప్రభుత్వాన్ని నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# అడ్వకేట్ అశోక్‌రావును పరామర్శించిన నిరంజన్‌రెడ్డి



**వనపర్తి, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న వనపర్తి 30వ వార్డుకు చెందిన అడ్వకేట్ డి. అశోక్‌రావును మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పరామర్శించారు. అశోక్‌రావు నివాసానికి వెళ్లిన ఆయన ఆరోగ్య పరిస్థితి, చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అవసరమైన సమయంలో అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తన అనుచరులు, అభిమానులకు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా అండగా నిలుస్తానని నిరంజన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, ఉంగ్లం తిరుమల్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, కే. మాణిక్యం, రఘువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# గట్టుకాడిపల్లిలో విద్యుత్ సమస్యకు పరిష్కారం



**ఉప్పునుంతల, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** గట్టుకాడిపల్లిలో విద్యుత్ సరఫరా సమస్యకు పరిష్కారం లభించింది. తరచూ అంతరాయం ఏర్పడుతుండటంతో గ్రామస్తులు సర్పంచ్ చింతగాళ్ల శ్రీనివాసుల దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి 25 వాట్ల విద్యుత్ బల్బు మంజూరు చేయించారు. ఆదివారం నూతన బల్బును ఏర్పాటు చేసి స్విచ్ ఆన్ చేశారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# నేడు కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమం




**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** ఓట్ల చోరీ వ్యవహారంపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ తీసుకున్న నిర్ణయాలను నిరసిస్తూ, ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రేపు వనపర్తి సమీకృత కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఐసీసీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో చేపట్టనున్న నిరసనల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం



**జడ్చర్ల, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి అన్నారు. జడ్చర్ల సిగ్నల్‌గడ్డ వద్ద బాపూజీ జయంతి వేడుకలు నిర్వహించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, నిబద్ధత కలిగిన రాజకీయవేత్తగా బాపూజీ సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు, పలువురు నేతలు పాల్గొన్నారు.

## గీతన్నలు పోరాటాలకు సిద్ధం కావాలి

**కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ మహేష్‌గౌడ్**

**మక్తల్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** గీత కార్మికులు హక్కుల సాధనకు పోరాటాలకు సిద్ధం కావాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ బిజ్వార్ మహేష్‌గౌడ్ పిలుపు నిచ్చారు. బిజ్వార్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గౌడ సంక్షేమానికి రూ.5 వేల కోట్లు కేటాయించాలని, గీత కార్మికుల పెన్షన్ రూ.4 వేలకు పెంచాలని, ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు పెంచాలని కోరారు.
50 ఏళ్లు నిండిన వారికి పెన్షన్ అందించాలని, నీరా, తాటి ఉత్పత్తుల పరిశ్రమలను ప్రోత్సహించి ఉపాధి కల్పించాలని అన్నారు. ప్రమాదాల నివారణకు రక్షణ కిట్లు అందించాలని డిమాండ్ చేశారు.



# ఘనంగా అమ్మకు అక్షరమాల పరీక్షలు



**మక్తల్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** చదువుకు వయసుతో సంబంధం లేదని మక్తల్ మండలంలో 'అమ్మకు అక్షరమాల' కార్యక్రమం నిరూపించింది. ఉల్లాస్ పరీక్షల్లో తల్లులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సర్పంచ్ శ్రీనివాసులు గౌడ్, ఉపసర్పంచ్ బాలకృష్ణ, గ్రామ సంఘం సహాయకురాలు హైమావతి పరీక్ష రాశారు. ప్రతి తల్లి అక్షరాస్యురాలైతే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని సర్పంచ్ అన్నారు. కార్యక్రమంలో మహిళలు, గ్రామ పెద్దలు, అక్షర బోధకులు పాల్గొన్నారు.

# మొబైల్‌తోనే చిత్రసృజనకు బాటలు

- టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి
- యువతలో సృజనాత్మకతకు సాంకేతికత తోడ్పాటు
- 56 మంది విద్యార్థులకు చిత్రీకరణపై శిక్షణ.. ధ్రువపత్రాల అందజేత



**కల్వకుర్తి, సెప్టెంబరు 27 (జనంసాక్షి):** స్మార్ట్‌ఫోన్ ద్వారా చిత్రీకరణ, ఫొటోగ్రఫీ, కథన రూపకల్పనలో యువతకు అవకాశాలు పెరుగుతున్నాయని టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని టాస్క్ కార్యాలయంలో శనివారం విద్యార్థులకు ఒకరోజు చిత్రీకరణ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వివిధ కళాశాలలకు చెందిన 56 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ..** సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో ఖరీదైన పరికరాలు లేకుండానే స్మార్ట్‌ఫోన్‌తో మంచి చిత్రాలను రూపొందించే అవకాశం ఏర్పడిందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రాయోగిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. చిత్రీకరణ, ఫొటోగ్రఫీ, విషయ రూపకల్పన వంటి రంగాల్లో నైపుణ్యాలు పెంచుకుంటే ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు.

శిక్షణలో చిత్రీకరణ ప్రాథమిక అంశాలు, కెమెరా వినియోగం, దృశ్య నిర్మాణం, వెలుతురు, కథను దృశ్యరూపంలో చూపించే విధానం తదితర అంశాలపై విద్యార్థులకు ప్రాయోగిక అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసిన 56 మంది విద్యార్థులకు టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి చేతుల మీదుగా ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శిక్షణ బృందం సభ్యుడు రోషన్‌తోపాటు టాస్క్ ప్రతినిధులు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి కోర్టు కొత్త భవనానికి కదలిక

- నిధుల మంజూరుకు ఎమ్మెల్యే కసిరెడ్డికి న్యాయవాదుల వినతి
- ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే
- త్వరలో శంకుస్థాపనకు చర్యలు చేపట్టాలని సూచన



**కల్వకుర్తి, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** కల్వకుర్తి కోర్టు నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని స్థానిక న్యాయవాదులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరారు. ఆదివారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్‌కుమార్‌తో కలిసి హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కోర్టు నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే స్థానిక ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈతో ఫోన్‌లో మాట్లాడి భవన నిర్మాణ ప్రతిపాదనలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రతిపాదనలను త్వరగా తనకు అందజేయాలని అధికారులను ఆదేశించారు. లా విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీతో మాట్లాడి భవన నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. త్వరలోనే కోర్టు నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన జరిగేలా కృషి చేయాలని న్యాయవాదులను కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.మల్లేష్, ప్రధాన కార్యదర్శి జమీల్ అహ్మద్, ఉపాధ్యక్షుడు నాగరాజు, సీనియర్ న్యాయవాదులు వెంకట్‌రెడ్డి, చిందం కృష్ణయ్య, భాస్కర్‌రెడ్డి, వెంకట్‌రమణ, లక్ష్మణ్‌రాజు, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియా వారియర్స్‌దే కీలక భూమిక

- వాస్తవాలు, గణాంకాలతో ప్రతిపక్ష ప్రచారానికి సమాధానం ఇవ్వాలి




**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో సోషల్ మీడియా వారియర్స్ కీలక పాత్ర పోషించాలని డీసీసీ అధ్యక్షుడు కొత్తకాపు శివసేన రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన సోషల్ మీడియా కోఆర్డినేటర్ల సమావేశంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియాలో ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారానికి వాస్తవాలు, గణాంకాలతో సమాధానం ఇవ్వాలని సూచించారు. కులం, మతం వంటి అంశాలను ప్రస్తావించకుండా విషయాధారంగా పోస్టులు రూపొందించాలని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు సులభంగా అర్థమయ్యే భాషలో వివరించాలని సూచించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక భారాల మధ్య కూడా ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. పేదలు, రైతులు, నిరుద్యోగులు, బడుగు బలహీన వర్గాల కోసం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత సోషల్ మీడియా కార్యకర్తలపై ఉందన్నారు. యువత, ముఖ్యంగా జెన్ జీ, సామాజిక మాధ్యమాల ద్వారా సమాచారాన్ని తెలుసుకుంటున్న నేపథ్యంలో దీనిని బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని కోరారు. అసత్య ప్రచారాలను వాస్తవాలతో తిప్పికొట్టడంతోపాటు పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సోషల్ మీడియా కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, కేసులు, బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. గ్రామ, మండల, పట్టణ, జిల్లా స్థాయి నాయకులు సోషల్ మీడియా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తిరుపతయ్య, సాయి చరణ్‌రెడ్డి, బ్రహ్మంచారి, ధనలక్ష్మి, కోళ్ల వెంకటేష్, బి.కృష్ణ, వివిధ మండలాల అధ్యక్షులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# పలు కార్యక్రమాల్లో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి


**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సెప్టెంబర్ 29న ఎం.ఎన్.ఆర్ బ్యాంక్వెట్ హాల్‌లో నిర్వహించనున్న నవ యుగ కవి చక్రవర్తి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత గుర్రం జాషువా 131వ జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆయన ఆవిష్కరించారు. తన ఆధ్వర్యంలో జాషువా జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ముఖ్య అతిథిగా, పలుస శంకర్ గౌడ్ సభాధ్యక్షులుగా వ్యవహరించనున్నారు. ఆత్మీయ అతిథులుగా రావుల చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, ప్రధాన వక్తలుగా ఆచార్య కోయి కోటేశ్వరరావు, డాక్టర్ జిలుకర శ్రీనివాస్ పాల్గొననున్నారు. కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, సాహితీప్రియులు, దళిత బహుజన నాయకులు, జాషువా అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. అలాగే బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నూకల విశ్వనాథం జన్మదినం, 51వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఆయన సతీమణి వాసంతి నిరంజన్ రెడ్డి దంపతులు నూకల విశ్వనాథంను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు శుభకార్యాలకు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. బీఆర్ఎస్ నాయకులు నారాయణ నాయక్ సోదరుడు రవి నాయక్ కుమార్తె మిన్ను పుట్టుచీర కార్యక్రమంతో పాటు మెంటేపల్లి గ్రామానికి చెందిన కావేటి సుష్మ, మహంత్ యాదవ్, గిరీష్ యాదవ్ కుటుంబాల పుట్టుచీర, పుట్టుపంచ వేడుకల్లో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇదే సందర్భంగా అడ్డాకల్ మండలం కన్మనూర్ మాజీ సర్పంచ్ సుమతమ్మ, భీమిరెడ్డి దంపతుల మనవరాలు, ఝాన్సీ కుమార్తె నక్షత్ర ఉస్మానియా యూనివర్సిటీలో మెడిసిన్ సీటు సాధించడంపై సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, వాసంతి నిరంజన్ రెడ్డి దంపతులు ఆమెను ఘనంగా సన్మానించి అభినందించారు. నక్షత్ర తమ నియోజకవర్గానికి వన్నె తీసుకొచ్చిందని నిరంజన్ రెడ్డి పేర్కొంటూ, విద్యకు సంబంధించిన అవసరాల్లో అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్, కురుమూర్తి యాదవ్, జాత్రు నాయక్, ప్రేమ్‌నాథ్ రెడ్డి, నాగన్న యాదవ్, దేవర్ల నరసింహ, బాబు నాయక్, శంకర్ గౌడ్, గౌడ్ నాయక్, అలీం తదితరులు పాల్గొన్నారు.







# ఒంట్లో పంప్ బాగుందా?



మన ప్రాణం నిలుస్తుంది. ఇది రాత్రనకా, పగలనకగా నిరంతరం రక్తాన్ని పంప్ చేస్తుంటుంది. ఒక్క క్షణం మొరాయించినా శరీరం కుప్పకూలుతుంది. మన గుండెను ఇంట్లో నీటిని తోడే మోటారు పంపుతో పోల్చుకోవచ్చు. ఒకవేళ పంపు సరిగా నడవటం లేదనుకోండి. పైపుల లోపల ఏవో అడ్డుపడ్డాయి లేదా ఉన్నట్టుండి పంపే ఆగిపోయింది అనుకోండి.

### గుండె వైఫల్యం అంటే?

గుండె వైఫల్యమంటే మొత్తంగా గుండె ఆగిపోవటం కాదు. పంప్ బలహీనపడిందని, సమర్థంగా రక్తాన్ని పంప్ చేయటం లేదని అర్థం. నీటి పంప్ పనిచేస్తున్నా మునుపటిలా నీటిని బలంగా తోడటం లేదనుకోండి. ఏమవుతుంది? ట్యాంకులో, పైపుల్లో నీరు నిల్వ ఉంటుంది కదా. సరిగ్గా గుండె వైఫల్యంలోనూ ఇలాగే జరుగుతుంది. గుండె రక్తాన్ని సమర్థంగా పంప్ చేయకపోవటం వల్ల ఊపిరితిత్తులు, కాళ్ల వంటి భాగాల్లో ద్రవాలు పోగుపడతాయి.

**పరీక్షలు క్రమం తప్పకుండా:** బీపీ, గ్లూకోజు, కొలెస్ట్రాల్ పరీక్షలు చేయించుకోవాలి. బరువునూ కొలుచుకోవాలి. తేడాలు కనిపిస్తే వెంటనే జాగ్రత్త పడొచ్చు. చిన్న సమస్యలను ముందే పట్టుకుంటే ముమ్ముందు పెద్ద ప్రమాదం

### గుండెపోటు అంటే?

మీరు కారులో ప్రయాణిస్తున్నారు. ట్రాఫిక్ జామ్ అయ్యింది. కార్లు ఒకదాని వెనక ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఒకటే హారన్ మోతలు. ఏదీ ముందుకు కదలటం లేదు. గుండెపోటు సరిగ్గా ఇలాగే సంభవిస్తుంది. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ధమనులే రోడ్లు. ఇవి గుండె కండరానికి రక్తాన్ని చేరవేస్తాయి. ఈ ధమనుల్లో అడ్డంకులు (పూడికలు) ఏర్పడితే రక్తం సరిగా సరఫరా కాదు. సాధారణంగా కొవ్వు, కొలెస్ట్రాల్ పోగుపడి పూడికలుగా మారుతుంటాయి. వీటి మూలంగా రక్తం అందని గుండె భాగం ఆక్సిజన్ కొరవడి, చచ్చుబడటం మొదలవుతుంది. ఇదే గుండెపోటు.

### లక్షణాలు ఇవీ

1. ఛాతీలో నొప్పి ఛాతీ బిగపట్టినట్టు, పెద్ద బరువేదో మోపినట్టు అనిపించటం.
2. ఎడమ చేయి, మెడ, దవడ, వీపు భాగానికి నొప్పి విస్తరించటం.
3. శ్వాస తీసుకోలేక ఆయాస పడటం.
4. చెమట పట్టటం, వికారం, వాంతి.

ఆడవారిలో, వృద్ధుల్లో ఇలా స్పష్టమైన లక్షణాలు ఉండకపోవచ్చు. వీరిలో ఏదో నిస్సత్తువగా ఉండటం, తల తిప్పటం, అజీర్ణం వంటివి కనిపిస్తుంటాయి. దీంతో చాలాసార్లు గుండెపోటును పోల్చుకోవటంలో పొరపడుతుంటారు. సినిమాల్లో చూపించినట్టు గుండెపోటు అన్నిసార్లూ హఠాత్తుగా రావాలనేమీ లేదు. కొన్నిసార్లు నెమ్మదిగా తలెత్తొచ్చు. అందువల్ల హెచ్చరిక సంకేతాల మీద ఓ కన్నేసి ఉంచటం మంచిది.

### సాధారణ ముప్పు కారకాలు

దుమ్ము, తుప్పు పడితే మోటారు పంపు, పైపులు దెబ్బతిన్నట్టుగానే కొన్ని అలవాట్లు, సమస్యలు గుండెను దెబ్బతీస్తుంటాయి.

**అధిక రక్తపోటు:** ఇది నిశ్శబ్ద హంతకి. రక్తనాళాలను ఒత్తిడికి గురిచేస్తుంది.
**మధుమేహం:** దీంతో రక్తనాళాలు బలహీనమవుతాయి. అధిక కొలెస్ట్రాల్:
**మద్యం తాగటం:** ఇవి ఊబకాయం, పోషణలేమి: గుండె
రక్తనాళాల్లో పోగుపడి, పూడికలకు దారితీస్తుంది. పొగ, గుండె, రక్తనాళ వ్యవస్థలను దెబ్బతీస్తాయి. చెప్పకపోతే బలహీనమవుతుంది. మానసిక ఒత్తిడి: దీంతో హార్మోన్ల మోతాదులు పెరిగి గుండె లయ అస్తవ్యస్తమవుతుంది.
**కుటుంబ చరిత్ర:** జన్యుపరంగా గుండె జబ్బులు వచ్చే అవకాశం గలవారికి అవి త్వరగా ముంచుకొస్తాయి. మీద అదనపు భారం పడేలా చేస్తాయి. శ్రమ చేయకపోవటం: గుండెకు పని నివారణ సాధ్యమే

మోటారును శ్రద్ధగా కనిపెట్టుకుంటూ, పైపులు శుభ్రంగా ఉంచుకుంటూ, తగినంత విద్యుత్తు అందేలా చూసుకుంటే ఎక్కువకాలం మన్నికగా పనిచేస్తుంది కదా. ఇది గుండెకూ వర్తిస్తుంది.

**మంచి ఆహారం:** తాజా పండ్లు, కూరగాయలు, నిండు గింజ ధాన్యాలతో కూడిన ఆరోగ్యకరమైన ఆహారం తినాలి. ఉప్పు, చక్కెర, మిఠాయిలు, వేపుళ్లు తగ్గించుకోవాలి.

**వ్యాయామం:** రోజూ క్రమం తప్పకుండా అరగంట సేపు నడవటం లేదా వ్యాయామం చేయటం ద్వారా గుండె బలంగా ఉండేలా చూసుకోవచ్చు. గుండెకు కదలికే ఔషధమని తెలుసుకోవాలి.

పొగ, మద్యం వద్దు: వీటికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. ఒత్తిడి తగ్గించుకోవాలి: ధ్యానం, యోగా, గుండె లబ్ డబ్మని కొట్టుకుంటూ ఉంటేనే